

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365



WWW.NETIDARSHINI.COM

# నేటి దర్శిని

PRGI NO: APTEL/26/A5450

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...


విజయవాడ గురువారం 17-09-2026 సంపుటి: 02 సంచిక : 77 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని

Vijayawada Thursday, 17-09-2026 Volume :02 Issue: 77 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani



రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది. తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.



Contact Number
9059328777


# సౌదీపై హౌతీల దాడులు

- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత ముదురుతున్నాయి. సౌదీ అరేబియాలోని కీలక సైనిక స్థావరాలు, చమురు మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకుని హౌతీలు క్షిపణులు, డ్రోన్లతో దాడులకు పాల్పడుతున్నట్లు సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు వెల్లడించాయి. తాజాగా మక్కా సమీపంలోకి దూసుకొచ్చిన డ్రోన్ను కూల్చివేసినట్లు ప్రకటించడంతో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికుల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ హెచ్చరించింది. మరోవైపు మక్కాను లక్ష్యంగా చేసుకున్నామన్న ఆరోపణలను హౌతీలు ఖండించారు. ఈ పరిణామాలపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ.. సౌదీ భూభాగం, పౌరులు, కీలక మౌలిక వసతులపై దాడులు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. ఎర్ర సముద్రం--బాబ్ అల్ మండెబ్ జలసంధిలో నౌకాయాన భద్రతపై కూడా ఆందోళనలు పెరుగుతున్నాయి.



02



# రాబోయే మూడు రోజులు వర్షాలు!


- ద్రోణి ప్రభావంతో భారీ వర్షాలు
- మూడు జిల్లాలకు ఎల్లో అలర్ట్
- 19న ములుగు, భద్రాద్రి, ఖమ్మంలో భారీ వానలు
- రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం
- ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో అధిక లోటు
- మిర్యాలగూడలో 4.17 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్,
ఆవర్తన ద్రోణి ప్రభావంతో రాబోయే మూడు రోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. 19న ములుగు, భద్రాద్రి–కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు.మరోవైపు ప్రస్తుత సీజన్‌లో రాష్ట్రంలో 19 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో అధిక లోటు వర్షపాతం నెలకొన్నది. గడిచిన 24 గంటల్లో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిశాయి. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో అధికంగా 4.17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# తిరుమలకు మహా ప్రణాళిక

## ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా తిరుమల

- టీటీడీ అభివృద్ధికి ఆరు కీలక సూత్రాలతో సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- భక్తులకు రూ. 2 లక్షల బీమా.. వర్చువల్ దర్శనం వంటి నూతన సౌకర్యాలు
- నెట్-జీరో తిరుమలే లక్ష్యం.. 100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీకి ప్రణాళిక
- రాష్ట్రవ్యాప్తంగా 5 వేల కొత్త ఆలయాలు.. 'హబ్ అండ్ స్పోక్' విధానం
- తిరుపతి వైద్య సేవలకు ఒకే గొడుగు.. అపెక్స్ బాడీ ఏర్పాటుకు నిర్ణయం
- తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు



అమరావతి

తిరుమల క్షేత్రాన్ని ప్రపంచస్థాయి ఆధ్యాత్మిక, సేవా కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. తిరుమల పవిత్రతను కాపాడుతూ భక్తులకు అత్యుత్తమ సౌకర్యాలు కల్పించడంతో పాటు వైద్యం, విద్య, అన్నదానం, పర్యావరణ పరిరక్షణ వంటి సేవలను మరింత విస్తరించనున్నట్లు చెప్పారు. టీటీడీ భవిష్యత్ కార్యాచరణను అన్నదానం, ప్రాణదానం, శ్రీవారి సేవకులు, విద్యాదానం, దేవాలయాల నిర్మాణం, పర్యావరణ పరిరక్షణ అనే ఆరు ప్రధాన సూత్రాల ఆధారంగా ముందుకు తీసుకెళ్తామని వివరించారు. అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామని చంద్రబాబు తెలిపారు. ఇందుకోసం రూ.3,168 కోట్ల కార్పస్ ఫండ్ ఉందన్నారు. భక్తుల అవసరాలకు అనుగుణంగా అన్నప్రసాదంలో మజ్జిగకు

-మిగతా 2 లో



02

## లింగ సమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంక్

- వరుసగా 16వసారి ఐస్‌లాండ్ టాప్
- 145 దేశాలపై డబ్ల్యూఈఎఫ్ నివేదిక
- ఆర్థిక రంగంలో 41.2 శాతం ప్యారిటీ
- రాజకీయ సాధికారతలో తగ్గిన స్కోర్
- మంత్రి పదవుల్లో మహిళలు 5.9 శాతమే
- సమానత్వానికి మరో 120 ఏళ్లు
- సీఈఓ పదవుల్లో 19.1 శాతమే మహిళలు

## భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక

- అసురక్షితంగా దిశ మార్చడంతోనే ఘటన
- పాక్ దౌత్యాధికారికి సమన్లు
- పునరావృతం కాకుండా హెచ్చరిక
- 1991 ఒప్పందానికి విరుద్ధమన్న భారత్
- 2011లోనూ ఇలాంటి ఘటనే
- పాక్ నౌక తీరుపై తీవ్ర అభ్యంతరం



02



# పోలీసు కొలువుల జాతర

- 2,050 పోస్టుల భర్తీకి ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ ప్రకటన..
- ఎస్ఐలు, కానిస్టేబుళ్లు, ఫైర్‌మెన్, వార్డర్లు, డ్రైవర్లకు అవకాశం
- 438 ఎస్ఐ పోస్టులు.. 1,156 కానిస్టేబుల్, ఫైర్‌మెన్, వార్డర్ కొలువులు కమ్యూనికేషన్స్, రవాణా, ఫోరెన్సిక్ విభాగాల్లోనూ భారీగా ఖాళీలు

ఏపీ స్టేట్ బ్యూరో,

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు భారీ ఉద్యోగావకాశాలు అందుబాటులోకి వచ్చాయి. పోలీసు, అగ్నిమాపక, జైళ్లు, పోలీసు కమ్యూనికేషన్స్, పోలీసు రవాణా, ఫోరెన్సిక్ విభాగాల్లో ఏకంగా 2,050 పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు నోటిఫికేషన్లు జారీ చేసింది. పోలీసు శాఖలో సిబ్బంది కొరతను తగ్గించడంతో పాటు, వివిధ ప్రత్యేక విభాగాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ నియామకాలు కీలకంగా నిలవనున్నాయి. సెప్టెంబరు 16న పలు నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. పోలీసు శాఖలోనే మొత్తం 438 సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులు భర్తీ చేయనున్నారు. ఇందులో సివిల్ విభాగంలో 253, ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో 116, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో 9, పోలీసు కమ్యూనికేషన్స్‌లో 50, పోలీసు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో 10 ఎస్ఐ పోస్టులు ఉన్నాయి. వివిధ విభాగాల్లో అధికారుల కొరతను భర్తీ చేయడానికి ఈ నియామకాలు దోహదపడనున్నాయి. ఇక కానిస్టేబుల్ స్థాయిలోనూ భారీగా ఉద్యోగాలు ప్రకటించారు. సివిల్ పోలీసు కానిస్టేబుల్ పోస్టులు 542, ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుల్ పోస్టులు 285 కలిపి 827 పోస్టులు ఉన్నాయి.

-మిగతా 2 లో

# పింఛన్ దరఖాస్తుదారులకు శుభవార్త

## సెప్టెంబర్ 18వ తేదీ వరకు గడువు పొడిగించిన ఏపీ సర్కార్

- ఎన్టీఆర్ భరోసా పింఛన్ దరఖాస్తుల గడువు పొడిగింపు
- సెప్టెంబర్ 18వ తేదీ వరకు దరఖాస్తులకు అవకాశం
- అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని మంత్రి కొండపల్లి సూచన
- స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొనసాగుతున్న దరఖాస్తుల స్వీకరణ


అమరావతి, ఏపీ బ్యూరో,


ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్టీఆర్ భరోసా' పథకం కింద కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఊరటనిచ్చింది. దరఖాస్తుల స్వీకరణ గడువును మరో రెండు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. వాస్తవానికి సెప్టెంబర్ 7న ప్రారంభమైన ఈ ప్రక్రియ, ఈ నెల 16వ తేదీతో ముగియాల్సి ఉండగా, తాజాగా దానిని సెప్టెంబర్ 18వ తేదీ వరకు పొడిగించారు.

**గడువు పొడిగింపుపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారిక ప్రకటన**

గడువు పొడిగింపుపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారిక ప్రకటన చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. సెలవులు లేదా ఇతర కారణాల వల్ల ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, ఈ రెండు రోజుల అదనపు సమయంలో తమ దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

-మిగతా 2 లో



02

## పాస్‌పోర్ట్ ర్యాంకులో భారత్‌కు షాక్

- 73వ స్థానానికి పడిపోయిన భారత్
- ఏడాదిలో ఏడు స్థానాలు దిగజారిన వైనం
- టాప్‌లో యూఏఈ పాస్‌పోర్ట్
- 69కు పడిపోయిన మొబిలిటీ స్కోర్
- 25 దేశాలకు వీసా ఫ్రీ ప్రయాణం
- 129 దేశాలకు ముందస్తు వీసా తప్పనిసరి
- ర్యాంకింగ్స్‌పై కేంద్రం అభ్యంతరం




02

## భారత్‌పై అమెరికా 100 శాతం సుంకం?

- రష్యా ఆంక్షల బిల్లుతో భారత్‌కు ముప్పు
- తుది ఓటింగ్‌కు అమెరికా ప్రతినిధుల సభ
- 241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
- సెనేట్‌లో ఇప్పటికే ఆమోదం
- ట్రంప్‌కు పెరగనున్న సుంకాల అధికారం
- ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
- బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు

WWW.NETIDARSHINI.COM
PRGI NO:APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం

## లింగ సమానత్వంలో భారత్‌కు 131వ ర్యాంక్



ఢిల్లీ: స్త్రీ, పురుష సమానత్వం విషయంలో భారత్ 131వ స్థానంలో నిలిచింది. గతేడాది ఉన్న ర్యాంకునే మళ్లీ ఇండియా నిలుపుకుంది. లింగ సమానత్వంలో వరుసగా 16వ సారి తొలి స్థానంలో ఐస్‌లాండ్ నిలిచింది. ఫిన్లాండ్, నార్వే, నమీబియా, యూకే టాప్-5లో నిలిచాయి. 148 దేశాల్లో లింగ సమానత్వ స్థితిగతుల సమాచారంతో 'గ్లోబల్ జెండర్ గ్యాప్ ఇండెక్స్ 2026'ను వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) బుధవారం రిలీజ్ చేసింది. 145 దేశాలున్న ఈ సూచికలో భారత్ కంటే దిగువన కేవలం పపువా న్యూ గినియా, కువైట్, ఒమన్, ఖతార్, తజికిస్తాన్, సౌదీ అరేబియా, ఈజిప్ట్, మొరాకో, మాలి, అల్జీరియా, కాంగో వంటి 14 దేశాలు ఉన్నాయి. డబ్ల్యూఈఎఫ్ విడుదల చేసిన సూచికలో చాద్ అత్యల్ప ర్యాంకు (145)లో నిలిచింది. ఇరాన్ (144), పాకిస్తాన్ (143) ర్యాంకులతో అట్టడుగు జాబితాలో నిలిచాయి.

2006 నుంచి ఇప్పటి వరకు భారత్‌లో లింగ సమానత్వం 4.3 శాతం పాయింట్లు పెరిగింది. ఆర్థిక భాగస్వామ్యం, ఉపాధి అవకాశాల్లో భారత్ 41.2 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది. వృత్తి, సాంకేతిక రంగ కార్మికులు సాధించిన బలమైన పురోగతి కారణంగా ఆయా రంగాల్లో దేశంలో ప్యారిటీ స్కోర్ 2006లో 26.6 శాతం ఉండగా, 2026 నాటికి అది 49.9 శాతానికి చేరింది. రాజకీయ సాధికారత విభాగంలో మునుపటి ఏడాది కంటే 0.7 పాయింట్లు మేర తగ్గింది. భారత ప్రభుత్వంలోని మంత్రి పదవుల్లో మహిళల ప్రాతినిధ్యం 2006లో 2.4 శాతం ఉండగా, అది 2026 నాటికి 5.9 శాతానికి పెరిగింది. 2019లో ఈ విభాగంలో భారత్ అత్యధికంగా 30 శాతం ప్యారిటీ స్కోర్‌ను నమోదు చేసింది.

సమానత్వానికి 120 ఏళ్లు పడుతుంది..

పూర్తి లింగ సమానత్వం సాధించడానికి ఇంకా 120 ఏళ్లు పడుతుందని అంచనా వేసింది. ప్రపంచవ్యాప్తంగా లింగ అంతరం ఇప్పుడు 69.2 శాతానికి తగ్గిందని, ఇది గతేడాదితో పోలిస్తే 0.4 శాతం పాయింట్లు ఎక్కువని అభిప్రాయపడింది. ఏదైనా కంపెనీ లేదా సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పదవుల్లో మహిళలు 19.1 శాతం మాత్రమే ఉన్నారని చెప్పింది. మహిళలు నిర్వహిస్తున్న ప్రతి 10 మంత్రిత్వ శాఖలలో కేవలం ఒకటి మాత్రమే సరైనదని పేర్కొంది.

## భారత నిఘా నౌకను ఢీకొట్టిన పాక్ యుద్ధనౌక


- ఘటనపై విదేశాంగశాఖ ఆగ్రహం
- ఇస్లామాబాద్ దౌత్యవేత్తకు సమన్లు
- పాక్ హైకమిషన్ ఎదుట నిరసన



ఢిల్లీ: అరేబియా సముద్రంలో నావికాదళం దుందుడుకు చర్యకు పాల్పడింది. పాకిస్తాన్ యుద్ధనౌక ఒకటి వేగంగా వచ్చి భారత నిఘా నౌకను ఢీకొంది. ఈ ఘటనపై పాక్ దౌత్యాధికారికి భారత్ సమన్లు జారీ చేసింది. పాక్ నేవీని అదుపులో పెట్టుకోవాలని పాక్‌కు భారత విదేశాంగశాఖ గట్టి హెచ్చరికలు చేసింది. సెప్టెంబర్ 15 సాయంత్రం ఉత్తర అరేబియా సముద్రంలో ఈ ఘటన జరిగింది. భారత నౌకాదళానికి చెందిన ఓ ఫ్రంట్‌లైన్ యుద్ధనౌక సాధారణ నిఘా కార్యకలాపాల్లో భాగంగా సముద్రంలో పర్యటిస్తుండగా, పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన ఓ నౌక దాని వైపు వచ్చినట్లు తెలుస్తోంది. పాక్ నౌక అధిక వేగంతో భారత నౌకకు సమీపంగా వచ్చి, అసురక్షితంగా, వృత్తిపరమైన ప్రమాణాలకు విరుద్ధంగా దిశ మార్చుకోవడంతో రెండు నౌకలు ఢీకొన్నట్లు భారత వర్గాలు తెలిపాయి. అయితే ఈ ఘటనలో భారతీయ నావికాదళ సిబ్బందికి గానీ, యుద్ధనౌకకుగానీ ఎటువంటి ఆస్తి లేదా ప్రాణ నష్టం జరగలేదని ప్రాథమికంగా తెలుస్తోంది. ఈ బాధ్యతారాహిత్య చర్యను భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. పాక్ దౌత్యాధికారికి సమన్లు జారీ చేసి గట్టిగా మందలించింది. ఈ సంఘటన 1991 నాటి సైనిక విన్యాసాలు, కదలికలకు ముందస్తు సమాచారం ఇచ్చే ఒప్పందానికి విరుద్ధంగా ఉందని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాకిస్తాన్‌లోని సంబంధిత అధికారులకు ఈ విషయాన్ని తెలియజేయాలని కోరింది. కాగా, 2011లో పాక్ నేవీకి చెందిన బాబర్, ఐఎన్ఎస్ గోదావరి మధ్య ఇలాంటి ఘటనే జరిగింది. ఆ సమయంలో సముద్రపు దొంగల చెర నుంచి విడుదలైన ఎంబీ సూయజ్ అనే సరకు నౌకకు పాకిస్తాన్ నౌకాదళానికి చెందిన పిఎన్ఎస్ బాబర్ రక్షణ కల్పిస్తోంది.

## భారత్‌పై అమెరికా 100 శాతం సుంకం?

-రష్యా ఆంక్షల బిల్లుతో భారత్‌కు ముప్పు
-241--211 ఓట్లతో బిల్లుకు ఆమోదం
-సెనేట్‌లో ఇప్పటికే ఆమోదం
-ట్రంప్‌కు పెరగనున్న సుంకాల అధికారం
-ఇద్దరు డెమోక్రాట్ల మద్దతు
-బిల్లు ఆమోదిస్తే ట్రంప్ ముందుకు




వాషింగ్టన్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్‌పై గరిష్ఠంగా 100 శాతం వరకు సుంకాలు విధించేందుకు చట్టపరమైన మార్గం త్వరలో ఏర్పడే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన రష్యా ఆంక్షల బిల్లుపై అమెరికా ప్రతినిధుల సభలో బుధవారం మధ్యాహ్నం తుది ఓటింగ్ జరగనుంది. బిల్లు ఆమోదం పొందితే అధ్యక్షుడి ఆమోదానికి పంపిస్తారు.మంగళవారం సాయంత్రం ప్రతినిధుల సభలో బిల్లు విధానపరమైన అడ్డంకిని అధిగమించింది. ఇద్దరు డెమోక్రాట్లు తమ పార్టీ నిర్ణయానికి భిన్నంగా రిపబ్లికన్లతో కలసి బిల్లుకు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో తీర్మానం 241-211 ఓట్లతో ఆమోదం పొందింది. సెనేట్ ఇప్పటికే దీన్ని ఆమోదించింది.ు

## పాస్‌పోర్ట్ ర్యాంకులో భారత్‌కు షాక్

ఢిల్లీ:

ప్రపంచ దేశాల పాస్‌పోర్ట్‌ల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026' లో భారత్ స్థానం పడిపోయింది. ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్ లో భారత పాస్‌పోర్ట్ 73వ స్థానంలో నిలిచింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారింది. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా జాబితాలో చిట్టచివరన నిలిచింది. 'ఆర్టన్ క్యాపిటల్' సంస్థ ఈ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌ను రూపొందిస్తున్నది. వీసా లేకుండా (వీసా-ఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా 'మొబిలిటీ స్కోర్' (ఎంఎస్) కేటాయిస్తారు. ఈ స్కోర్ ఎంత ఎక్కువగా ఉంటే ఆ పాస్‌పోర్ట్ అంత శక్తిమంతమైనదని అర్థం. మొత్తం 199 దేశాల పాస్‌పోర్ట్‌లను ఈ ర్యాంకింగ్ కోసం విశ్లేషించారు. ప్రస్తుతం భారత్ మొబిలిటీ స్కోర్ 69గా ఉంది. ఈ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, సావో టోమ్ అండ్ ప్రిన్సిపీ, వియత్నాం వంటి దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్ ఉన్నవారు 25 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మరో 39 దేశాల్లో వీసా-ఆన్-అరైవల్ సౌకర్యం ఉంది. అయితే 129 దేశాలకు వెళ్లాలంటే ముందస్తుగా వీసా తప్పనిసరి. గత ఏడాదితో పోలిస్తే వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడంతో మొబిలిటీ స్కోర్ 73 నుంచి 69 కి పడిపోయింది. ఇదే ర్యాంకు పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ఈ జాబితాలో యూఏఈ పాస్‌పోర్ట్ 181 మొబిలిటీ స్కోర్‌తో ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా, 43 దేశాలకు వీసా-ఆన్-అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కేవలం 17 దేశాలకు మాత్రమే వారికి వీసా అవసరం. ఇక ఈ జాబితాలో ఆఫ్ఘనిస్థాన్ పాస్‌పోర్ట్ అత్యంత బలహీనమైనదిగా 99వ ర్యాంకులో ఉంది. దాని మొబిలిటీ స్కోర్ కేవలం 35 మాత్రమే. ఆఫ్ఘన్ పౌరులు ఏకంగా 163 దేశాలకు కచ్చితంగా వీసా తీసుకోవాల్సిందే. అయితే ఇలాంటి గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించడం లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్షంగా నిర్ణయించిన పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలను రూపొందిస్తున్నాయని కేంద్రం భావిస్తోంది. దీనిపై విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గత జూలై 31న లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. "పాస్‌పోర్ట్‌లకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచవ్యాప్తంగా ఆమోదయోగ్యమైన ప్రమాణాలు లేవు. అందుకే ఏ ర్యాంకింగ్ వ్యవస్థను ప్రామాణికంగా తీసుకోలేం" అని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

## తిరుమలకు మహా ప్రణాళిక

(మొదటి తరువాయి)

బదులుగా పెరుగు అందించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. తిరుపతిలోని స్విమ్స్, బిర్డ్, రుయా, చిన్నపిల్లల ఆసుపత్రి, కార్డియాలజీ, టాటా క్యాన్సర్, అరవింద్ కంటి ఆసుపత్రి తదితర వైద్య సంస్థలను సమన్వయం చేసేందుకు అపెక్స్ బాడీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా నమోదైన 800 మందికి పైగా శ్రీవారి వైద్య సేవకుల సేవలను వినియోగించుకుని తిరుపతిని అత్యుత్తమ వైద్య కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 12 లక్షల మంది శ్రీవారి సేవకులు నమోదు చేసుకున్నారని సీఎం తెలిపారు. వారికి ఉన్నతస్థాయి శిక్షణ ఇచ్చి వైద్యం, విద్య, సాంకేతిక, సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 5 వేల చిన్న ఆలయాల నిర్మాణాన్ని వేగవంతం చేయనున్నట్లు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్ట్ నిధులతో ఆలయాలను నిర్మించి, నియోజకవర్గ కేంద్రాల్లోని ప్రధాన ఆలయాలకు చిన్న ఆలయాలను 'హబ్ అండ్ స్పోక్' విధానంలో అనుసంధానించనున్నట్లు వివరించారు. విదేశాల్లో హిందువులు అధికంగా ఉన్న నగరాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణాన్ని ప్రోత్సహిస్తామన్నారు. తిరుమలను పర్యావరణహిత క్షేత్రంగా మార్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. పచ్చదనాన్ని పెంచడం, పవిత్ర వనం ఏర్పాటు, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజ్, బ్యాటరీ వంటి మార్గాల ద్వారా 100 మెగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేసి తిరుమలను 'నెట్-జీరో' క్షేత్రంగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. భక్తుల సంక్షేమానికి కూడా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు సీఎం తెలిపారు. సహజ మరణం సంభవించినప్పుడు భక్తుడి కుటుంబానికి రూ.2 లక్షల బీమా సాయం అందించే పథకాన్ని ఎల్ఐసీ సహకారంతో అమలు చేయనున్నట్లు చెప్పారు. ప్రమాద మరణాల పరిహారాన్ని కూడా పెంచినట్లు తెలిపారు. వర్చువల్ రియాలిటీ ఆధారిత దర్శన అనుభూతి, లైవ్ మెడిటేషన్ సెంటర్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించారు. రూ.104 కోట్లతో ఆధునీకరించిన శ్రీవారి మ్యూజియాన్ని కూడా అభివృద్ధి చేసినట్లు చంద్రబాబు తెలిపారు. ఇందులో 14 గ్యాలరీలు, వేలాది ప్రదర్శన వస్తువులు, కళాఖండాలు ఉన్నాయని చెప్పారు. తిరుపతి నగరంలో రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్ వరకు స్కైవాక్, పలు రహదారుల విస్తరణ వంటి మౌలిక వసతుల పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఉద్యోగుల ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. తిరుమలను రాజకీయ కార్యకలాపాలకు దూరంగా ఉంచాలని చంద్రబాబు స్పష్టం చేశారు. కష్టాల్లో ఉన్నవారికి, ఒత్తిడికి గురైన వారికి సాంత్వన కలిగించే 'హీలింగ్ సెంటర్'గా తిరుమల ఉండాలన్నదే తన ఆకాంక్ష అని తెలిపారు. టీటీడీకి సంబంధించిన ఆస్తులు, ఆభరణాలు, నిధుల వివరాలను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచి పూర్తి పారదర్శకత పాటిస్తామని చెప్పారు. భక్తుల సౌకర్యాలు, సేవా కార్యక్రమాలు, వైద్యం, విద్య, పర్యావరణ పరిరక్షణ, పారదర్శక పాలనను సమన్వయం చేస్తూ తిరుమలను భావితరాలకు ఆదర్శవంతమైన సుస్థిర దివ్యక్షేత్రంగా అందించడమే తన విజన్ అని చంద్రబాబు పేర్కొన్నారు

## సౌదీపై హౌతీల దాడులు

- చమురు కేంద్రం, వైమానిక స్థావరాలు లక్ష్యం
- క్షిపణులు, డ్రోన్లతో విధ్వంస వ్యూహం
- మక్కా సమీపంలో డ్రోన్ కలకలం
- కూల్చివేసిన సౌదీ సంకీర్ణ దళాలు
- 'రెడ్ లైన్' దాటితే తీవ్ర చర్యలు: సౌదీ హెచ్చరిక
- దాడుల్ని ఖండించిన భారత్



రియాద్:

మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మరింత తీవ్రరూపం దాలుస్తున్నాయి. సౌదీ లక్ష్యంగా హౌతీ తిరుగుబాటు దారులు విస్తృత దాడులకు తెగబడుతున్నారు. సౌదీ అరేబియాలోని కీలక సైనిక, చమురు మౌలిక సదుపాయాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేస్తున్నారు. తాజాగా, ఇస్లాం పవిత్ర నగరం మక్కాను లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడికి ప్రయత్నించారని సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు ఆరోపించాయి. ఈ ఆరోపణలపై ముస్లిం ప్రపంచంలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండగా, పవిత్ర స్థలాల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ స్పష్టం చేసింది. మక్కా వైపు వస్తున్న డ్రోన్ను కూల్చివేశామని సౌదీ తెలిపింది. సంకీర్ణ దళాల కమాండ్ మాత్రం హౌతీలకు తీవ్ర హెచ్చరిక చేసింది. మక్కా, మదీనా పవిత్ర మసీదులు. వాటిని సందర్శించే యాత్రికుల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని తెలిపింది. అవసరమైన, నిరోధక చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని పేర్కొంది. 57 ముస్లిం దేశాల సమాఖ్య అయిన ఇస్లామిక్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. అయితే ఈ ఆరోపణలను హౌతీలు తీవ్రంగా ఖండించారు. మక్కాను లక్ష్యంగా చేసుకుంటున్నారన్న సౌదీ ప్రకటన పూర్తిగా అబద్ధమని హౌతీ రాజకీయ విభాగం సభ్యుడు హజెమ్ అల్-అసద్ పేర్కొన్నారు. గతంలోనూ ఇలాంటి ఆరోపణాలు చేశారని, ఇప్పుడు కూడా అవి ప్రజలను మోసం చేయలేవని సోషల్ మీడియా వేదికగా వ్యాఖ్యానించారు.

దాడిని ఖండించిన భారత్

మక్కా పవిత్ర నగరానికి సమీపంలో డ్రోన్ను అడ్డుకున్న ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సౌదీ అరేబియా భూభాగంపై, ముఖ్యంగా పౌరులు, పౌర మౌలిక సదుపాయాలు, ఆర్థిక సంస్థలపై దాడులు ఆమోదయోగ్యం కాదని భారత విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రత, స్థిరత్వాన్ని దెబ్బతీయడంతో పాటు కీలక సముద్ర మార్గాల్లో నౌకయాన స్వేచ్ఛకు ముప్పుగా మారుతున్నాయని పేర్కొంది. మక్కా ప్రపంచవ్యాప్తంగా ముస్లింలకు అత్యంత పవిత్రమైన నగరం కావడంతో ఈ ఘటనకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పవిత్ర ప్రాంతాలు, యాత్రికులు, పౌరుల భద్రతను కాపాడాల్సిన అవసరాన్ని భారత్ నొక్కిచెప్పింది. ఇదే సమయంలో సౌదీ అరేబియాలోని చమురు మౌలిక సదుపాయాలు, వాణిజ్య నౌకాయానంపై జరుగుతున్న దాడులపైనా భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. బాబ్ అల్ మండెబ్ జలసంధి ద్వారా స్వేచ్ఛాయుత, సురక్షిత నౌకాయానం, వాణిజ్య ప్రవాహాన్ని త్వరగా పునరుద్ధరించాలని భారత్ కోరింది.

ఎర్ర సముద్రంలో హౌతీల దూకుడు

ఇటీవల హౌతీలు యెమెన్ ఎర్ర సముద్ర తీర ప్రాంతాల్లో తమ నియంత్రణను విస్తరించడంతో పాటు బాబ్ అల్ మండెబ్ జలసంధిపై అధిపత్యం పెంచుకున్నట్లు మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఈ మార్గం ఎర్ర సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఆడెన్తో కలుపుతుంది. అంతర్జాతీయ నౌకాయానానికి ఇది కీలకమైన మార్గం. హౌతీలు సౌదీకి చెందిన నౌకలను లక్ష్యంగా చేసుకుంటామని ప్రకటించడంతో ఎర్ర సముద్రంలోని నౌకాయాన భద్రతపై ఆందోళనలు పెరిగాయి. హౌతీలు సౌదీ అరేబియాలోని చమురు మౌలిక వసతులను కూడా లక్ష్యంగా చేసుకున్నట్లు సమాచారం. ప్రపంచంలోనే ప్రధాన చమురు ఎగుమతిదారైన సౌదీపై దాడులు అంతర్జాతీయ చమురు మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

## పింఛన్ దరఖాస్తుదారులకు శుభవార్త

(మొదటి తరువాయి)

ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 61.92 లక్షల మందికి ప్రతినెలా పింఛన్లు

రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటు చేసిన 'స్వర్ణ గ్రామం', 'స్వర్ణ వార్డు' కేంద్రాల్లో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అవసరమైన పత్రాలతో ఆన్‌లైన్ నమోదు, ఈ-కేవైసీ పూర్తి చేసిన తర్వాత దరఖాస్తుదారులకు రసీదులను అందజేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వృద్ధులు, వితంతువుల పింఛన్‌ను రూ.4,000లకు, దివ్యాంగుల పింఛన్‌ను రూ.6,000లకు పెంచిన విషయం తెలిసిందే. ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 61.92 లక్షల మంది ప్రతినెలా పింఛన్లు అందుకుంటున్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం, క్షేత్రస్థాయి పరిశీలన జరిపి కొత్త లబ్ధిదారులకు పింఛన్లను మంజూరు చేయనున్నారు.

## పోలీసు కొలువుల జాతర

(మొదటి తరువాయి)

వీటితో పాటు విపత్తు ప్రతిస్పందన, అగ్నిమాపక సేవల శాఖలో 158 ఫైర్‌మెన్ పోస్టులు, జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ విభాగంలో 150 పురుష వార్డర్, 21 మహిళా వార్డర్ పోస్టులు ఉన్నాయి. ఈ కేటగిరీల్లో కలిపి 1,156 పోస్టులు భర్తీ కానున్నాయి. పోలీసు కమ్యూనికేషన్స్ విభాగంలో మరో 200 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఆధునిక పోలీసింగ్‌లో కమ్యూనికేషన్ వ్యవస్థ ప్రాధాన్యం పెరుగుతున్న నేపథ్యంలో ఈ నియామకాలు ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. పోలీసు ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో 198 డ్రైవర్, 15 మెకానిక్ పోస్టులకు కూడా నోటిఫికేషన్ విడుదలయింది. పోలీసు దర్యాప్తులో శాస్త్రీయ ఆధారాల ప్రాధాన్యాల్ని దృష్టిలో ఉంచుకుని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబోరేటరీలో 43 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులను కూడా భర్తీ చేస్తున్నారు. ఇందులో ఫిజికల్ విభాగంలో 10, కెమికల్ విభాగంలో 13, బయోలజీ, సెరాలజీ విభాగాల్లో 20 పోస్టులు ఉన్నాయి. దీంతో సాంకేతిక నైపుణ్యం కలిగిన అభ్యర్థులకు కూడా ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మొత్తంగా చూస్తే పోలీసు వ్యవస్థలో కేవలం సంప్రదాయ కానిస్టేబుల్, ఎస్ఐ పోస్టులకే పరిమితం





కాకుండా కమ్యూనికేషన్స్, రవాణా, ఫైర్ సర్వీసెస్, జైళ్లు, ఫోరెన్సిక్ వంటి కీలక విభాగాల్లోనూ నియామకాలకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోలీసు వ్యవస్థలో మానవ వనరులను పెంచడంతో పాటు, ప్రజలకు వేగంగా సేవలు అందించే సామర్థ్యాన్ని మెరుగుపరిచే దిశగా ఈ నియామకాలు ఉపయోగపడనున్నాయి. పోలీసు శాఖలో తాజా నాయకత్వం అనంతరం నియామక ప్రక్రియకు ప్రాధాన్యం పెరగడం, పోలీసులను గుర్తించి భారీ స్థాయిలో నోటిఫికేషన్లు విడుదల చేయడం నిరుద్యోగ యువతలో ఆసక్తిని పెంచుతోంది. ముఖ్యంగా చాలా కాలంగా పోలీసు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఒకేసారి పెద్ద సంఖ్యలో పోస్టులు అందుబాటులోకి రావడం గణనీయమైన అవకాశం. ఈ పోస్టులకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేదీ, చివరి తేదీ, ప్రిలిమినరీ రాత పరీక్ష తేదీలను ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ ప్రత్యేకంగా ప్రకటించనుంది. అభ్యర్థులు అధికారిక నోటిఫికేషన్లలో పేర్కొన్న విద్యార్హతలు, వయోపరిమితి, శారీరక ప్రమాణాలు, ఎంపిక విధానం, రిజర్వేషన్లు తదితర నిబంధనలను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తు షెడ్యూల్ విడుదలైన వెంటనే ప్రక్రియ ప్రారంభం కానుంది.

2,050 పోస్టుల విభజన

ఎస్ఐ పోస్టులు -- 438
సివిల్ కానిస్టేబుళ్లు -- 542
ఏఆర్ కానిస్టేబుళ్లు -- 285
ఫైర్‌మెన్ -- 158
జైలు వార్డర్లు -- 171
కమ్యూనికేషన్ కానిస్టేబుళ్లు -- 200
డ్రైవర్లు -- 198, మెకానిక్‌లు -- 15,
సైంటిఫిక్ అసిస్టెంట్లు -- 43
మొత్తం -- 2,050 పోస్టులు.

# గణనాథుని పూజలో పాల్గొన్న డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాజీ మంత్రి



**ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వనపర్తి పట్టణ కేంద్రం న్యూ టౌన్ టీం బ్రదర్స్ ఆహ్వానం మేరకు మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై గణపతి మండపంలో విఘ్నేశ్వరునికిప్రత్యేక పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. చిన్నారెడ్డి మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. బొజ్జ గణపయ్య కృపాకటాక్షాలతో రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అలాగే, కాలనీవాసులు, పట్టణ ప్రజలు ప్రతి ఏటా ఐక్యమత్యంతో, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఈ ఉత్సవాలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. భక్తులందరూ పండుగను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాల మధ్య, సోదరభావంతో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు సమ్మద్ మియా, వనపర్తి మండల్ కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు నారాయణ,వనపర్తి జిల్లా ఎం ఎస్ యు ఐ నాయకులు ఎత్తం చరణ్ రాజ్, వనపర్తి పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సీనియర్ నాయకులు ద్వార పోగు విజయబాబు, నరేందర్ ,సిరివాటి సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

# చింతలపాలెం ఘటనపై తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య తీవ్ర దిగ్భ్రాంతి..

**-పూజారి దత్తు ప్రసాద్ మరణం పట్ల డా. సముద్రాల విజయసారథి సంతాపం**



**రామగిరి,సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** నల్గొండ జిల్లా,తిరుమలగిరి (సాగర్) మండలం,చింతలపాలెం గ్రామంలో వినాయక చవితి రోజున విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని గణేష్ మండపంలో పూజ విషయంలో ముందుగా తమ మండపంలోనే పూజ చేయాలంటూ కొందరు వ్యక్తులు పూజారి దత్తు ప్రసాద్ (62)తో వాగ్వాదానికి దిగారు. ఆ ఒత్తిడి మరియు గొడవ జరిగిన కొద్దిసేపటికే ఆయన మండపం వద్దే అకస్మాత్తుగా స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే ఆసుపత్రికి తరలించే లోపే ఆయన గుండెపోటుతో మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ ఘటనపై తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి,పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం సెంటనరీకాలనీ శ్రీ భద్రకాళి ఆలయ ప్రధాన పూజారి డా.సముద్రాల విజయసారథి తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పవిత్రమైన వినాయక మండపం వద్ద, పూజారిపై ఇలా ఒత్తిడి తెచ్చి వాగ్వాదానికి దిగడం అత్యంత బాధాకరం,అమానుషమని,ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భయాందోళనతో పూజారి గుండెపోటుతో మరణించడం పూజారి లోకానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత దత్తు ప్రసాద్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ,వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

# ఘనంగా రఘువీరారెడ్డి వర్ధంతి




**రామగిరి, సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** టీబీజీకేఎస్ ఆర్జీ త్రీ మాజీ ఉపాధ్యక్షుడు స్వర్గీయ ముద్దసాని రఘువీరారెడ్డి 9వ వర్ధంతి వేడుకలను సెంటినరీ కాలనీలోని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కార్యాలయంలో నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు. ఆర్జీ త్రీ ఏపీఏ ఏరియా ఉపాధ్యక్షుడు నాగేల్లి సాంబయ్య ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ,డివిజన్ కమిటీ,పిట్ కమిటీ నాయకులు రఘువీరారెడ్డి చిత్రపటానికి పూలమాలను,పూలను అర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. 9 సంవత్సరాల క్రితం యూనియన్ ఎన్నికల సందర్భంగా హైదరాబాదులో నామినేషన్ వేసి తిరిగి వస్తున్న సందర్భంలో దురదృష్టవశాత్తు బస్సు యాక్సిడెంట్ జరిగి రఘువీరారెడ్డి దుర్మరణం చెందడం జరిగిందని ఉపాధ్యక్షులు సాంబయ్య వివరించారు. ఆయన మరణం తన కుటుంబానికే కాకుండా తెలంగాణ బొగ్గు గాని కార్మిక సంఘానికి కూడా తీరని లోటుగా మారిందని వివరించారు. ఆ సమయంలో యూనియన్ నాయకులు మరియు టిఆర్ఎస్ పార్టీ సైతం ఆ కుటుంబానికి అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఇట్టి ఆక్సిడెంట్ లో మరికొంతమంది తీవ్రంగా గాయపడడం గుర్తు చేస్తూ విచారాన్ని వ్యక్తం చేస్తూ వారంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని భగవంతుని వేడుకుందామన్నారు. రఘువీరారెడ్డి ఆశయ సాధనలో భాగంగా రానున్న ఎన్నికల్లో ఈ డివిజన్లో టీబీజీకేఎస్ ను గెలిపించే విధంగా అందరం కలిసికట్టుగా పనిచేయడంతో పాటు ఆయన పేరుతో నిర్మిస్తున్న నూతన కార్యాలయ భవనాన్ని పూర్తి చేసుకుందామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ కమిటీ నాయకులు కేశవరావు,దేవ శ్రీనివాస్,పాశం శ్రీనివాస్ రెడ్డి, బోయినపల్లి శ్రీకాంత్ రావు,బ్రాంచి సెక్రటరీ గండి శ్రీనివాస్,ఓ సి పీ 1 ఫిట్ సెక్రటరీ గేటుకు శ్రీనివాస్,ఓ సి పీ 2 పిట్ సెక్రటరీ వేముల రవిశంకర్,వర్క్ షాప్ ఫిట్ సెక్రెటరీ చిప్ప సురేష్,అడ్రియాల గని పిట్ సెక్రెటరీ వి వి గౌడ్,డివిజన్ కమిటీ నాయకులు పొన్నం సదయ్య,మాదాసి చంద్రయ్య, కుమ్మరికుంట వెంకటేశం,శాఖమూరి వెంకటేశ్వర్లు,దద్దెడచంద్రశేఖర్, గాండ్ల సతీష్,దూల కంటి రాఘవరెడ్డి,శశి కుమార్ టీబీజీకేఎస్ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో ద్రాక్షారామలో పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమం






**ద్రాక్షారామ, సెప్టెంబర్ 16, ( నేటి దర్శిని )** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ గ్రామంలో భీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన భీమాబాయి మహిళా మండలి హెల్త్ ప్రోగ్రాం ఆర్గనైజర్ జి చంద్రకళ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎన్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ ఆహారపరమైన క్రమశిక్షణ పాటించడం ద్వారానే ఆరోగ్యకరమైన జీవితాన్ని కొనసాగించవచ్చునన్నారు. అంగన్వాడీ కార్యకర్త సత్యవేణి మాట్లాడుతూ ఆకుకూరలు, కాయగూరలు, పండ్లలో గల పోషక విలువలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భీమాబాయి మహిళా మండలి కమ్యూనిటీ ఆర్గనైజర్ సత్యనారాయణమ్మ,ప్రాజెక్టు పరిధిలోని మహిళలు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



**భూపాలపల్లి, సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** భూపాల్ పల్లి జిల్లా మల్హార్ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని కొయ్యూరులోని కాంప్లెక్స్ భవన్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎన్నికైన కేజీబీవీ పాఠశాలకు చెందిన కొత్తూరు రాధిక, పూర్ణ చందర్ వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులను ఎంఈఓ లక్ష్మణ్ బాబు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తెలుగు అధ్యాపకులు కొత్తూరు రాధిక మాట్లాడుతూ పాఠశాలలో చేరిన బాల్య దశలో అక్షర జ్ఞానం కల్పించి విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసి, విజ్ఞానవంతులుగా తీర్చిదిద్ది ప్రపంచానికి పరిచయం చేసే వారే ఉపాధ్యాయులని అన్నారు. కుల మత బేధాలు, ధనిక పేద వ్యత్యాసాలు లేకుండా అందరికీ సమానమైన జ్ఞానాన్ని విద్యార్థులకు ఉపాధ్యాయులు అందిస్తున్నారని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం ఎంతో గర్వకారణమని అన్నారు. మా ఎంపికకు కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేశారు..

# వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా చిట్టూరి చలపతిరావు



**తాళ్లరేవు, సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్సీపి పంచాయతీ రాజ్ విభాగం ప్రధాన కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకులు చిట్టూరి చలపతి రావు నియమితులు అయ్యారు. ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతూ సుదీర్ఘ కాలం తాళ్ళరేవు గ్రామ కమిటీ కన్వీనర్ గా పని చేశారు. తాళ్ళరేవు 1 ఎంపీటీసీ సభ్యురాలిగా చిట్టూరి చలపతి భార్య చిట్టూరి లలిత పద్మ కొనసాగుతున్నారు. తన సేవలను గుర్తించి,పార్టీ పదవి వచ్చేందుకు సహకరించిన ముమ్మిడివరం నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు మరియు వైయస్ఆర్సీపీ సమన్వయకర్త పొన్నాడ వెంకట సతీష్ కుమార్ కు, జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డికి, తాళ్ళరేవు జడ్పీటీసీ దొమ్మేటి సామ్యూల్ సాగర్ కు,వైయస్సార్సీపి తాళ్లరేవు మండల అధ్యక్షులు కాదా గోవింద్ కుమార్ కు, పార్టీ శ్రేణులకు చిట్టూరి చలపతి కృతజ్ఞతలు తెలియజేశారు.

# జెఎన్టియుహెచ్ యూసీఈ మంథనిలో విజిలెన్స్,సత్ప్రవర్తనపై అవగాహన సదస్సు

**సీఎంపీఎఫ్ఓ (గోదావరిఖని ప్రాంతీయ కార్యాలయం) ఆధ్వర్యంలో నిర్వహణ**






**రామగిరి సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** ప్రస్తుతం కొనసాగుతున్న మూడు నెలల విజిలెన్స్ అవగాహన ప్రచారంలో భాగంగా,తెలంగాణ ప్రభుత్వ పరిధిలోని జెఎన్టియుహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మంథని లో ఒక సమగ్ర అవగాహన సదస్సు విజయవంతంగా నిర్వహించబడింది. అవినీతి రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా జరిగిన ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం,అధ్యాపకులు మరియు వందలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సమాజంలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు నైతిక పాలనను పెంపొందించడమే ఈ అవగాహన సదస్సు యొక్క ముఖ్య ఉద్దేశ్యం. ఈ కార్యక్రమం సందర్భంగా విద్యార్థులు, అధ్యాపకులు మరియు బోధనేతర సిబ్బంది అందరితోనూ 'సత్ప్రవర్తన ప్రతిజ్ఞ' చేయించారు. ఇది విద్యార్థుల విద్యా విషయాల్లోనే కాకుండా,భవిష్యత్తు వృత్తిపరమైన జీవితంలోనూ నిజాయితీ, నైతిక విలువల పట్ల వారి వ్యక్తిగత, సామూహిక నిబద్ధతను మరింత బలోపేతం చేసింది. సీఎంపీఎఫ్ఓ ప్రాంతీయ అధినేత భరత్ కుమార్ ఎ.వై. అందరితో ఈ సత్ప్రవర్తన ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కమిషనర్-II డాక్టర్ గోవర్ధన్,కళాశాల అధ్యాపక బృందంతో పాటు సీఎంపీఎఫ్ఓ ప్రతినిధులు,శ్యాము గణేశన్, కామేశ్వరరావు,అనిత మరియు రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# సామాన్యుల నడ్డి విరిచేలా యూపిఐ చార్జీల భారం

**సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**

**యూపిఐ చెల్లింపుల చార్జీలపై హనుమకొండలో సిపిఐ నిరసన**




**హనుమకొండ సెప్టెంబర్ 16, (నేటి దర్శిని)** సామాన్యుల నడ్డి విరిచేలా కేంద్ర ప్రభుత్వం యూపిఐ చెల్లింపులపై చార్జీల భారం మోపు చున్నదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం హనుమకొండ కాళోజీ సెంటర్ లో కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న యూపిఐ చెల్లింపులపై చార్జీలకు వ్యతిరేకంగా నిరసన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూపిఐ చెల్లింపులపై చార్జీల బాదుడు మానుకోవాలని, కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, సామాన్యులపై భారం మోపుతున్న బిజెపి ప్రభుత్వ వైఖరి నశించాలని ప్లకార్డులతో సిపిఐ కార్యకర్తలు నినాదాలు చేశారు. అనంతరం రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలో డిజిటల్ ఇండియా నినాదంతో అధికారంలోకి వచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఇప్పుడు సామాన్య ప్రజలు, మధ్యతరగతి వర్గాలు, చిన్న వ్యాపారుల నడ్డి విరిచేలా యూపీఐ లావాదేవీలపై పరోక్షంగా ఛార్జీల భారాన్ని మోపేందుకు సిద్ధమైందని అన్నారు. ?గత కొన్ని సంవత్సరాలుగా డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న మోదీ ప్రభుత్వం, తాజాగా రూ. 2,000 మించిన యూపీఐ లావాదేవీలపై ఛార్జీలు వసూలు చేసేందుకు మార్గం సుగమం చేయడం అత్యంత దుర్మార్గం అని, రోజువారీ చిన్న వ్యాపారాలు, కిరాణా షాపుల్లో జరిగే లావాదేవీలపై ఈ నిబంధనలు తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు అత్యంత సులువుగా వాడే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థను సంక్లిష్టం చేసి, కార్పొరేట్ సంస్థలకు, విదేశీ పేమెంట్ గేట్‌వేలకు లబ్ధి చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. యూపీఐని డిజిటల్ ఇండియాకు ప్రతీకగా ప్రధాని మోదీ పదేపదే ప్రాజెక్ట్ చేశారని, అయితే విదేశీ ఒత్తిళ్ల కారణంగా దాని స్వయంప్రతిపత్తిని వదులుకోవడం మన డిజిటల్ సార్వభౌమత్వానికే ఒక మచ్చ అని, ఇది చివరికి విదేశీ చెల్లింపు కార్పొరేషన్ల వాణిజ్య ప్రయోజనాలకు సేవ చేస్తూ, వ్యాపారులపై, వినియోగదారులపై భారాన్ని మోపుతుందన్నారు. వాల్‌మార్ట్ యాజమాన్యంలోని ఫోన్‌పే, ఆల్ఫాబెట్ యాజమాన్యంలోని గూగుల్ పే లు సంయుక్తంగా దాదాపు 80 శాతం యూపీఐ లావాదేవీలను ప్రాసెస్ చేస్తున్నాయని,మోదీ ప్రభుత్వం ఇప్పటికే భారతదేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థలో సింహభాగాన్ని ఈ సంస్థలకు కట్టబెట్టిందని,ప్రజా డిజిటల్ మౌలిక సదుపాయాలను భారీగా వినియోగిస్తున్నందుకు, వేల కోట్ల ఆదాయాన్ని ఆర్జిస్తున్న ఈ దిగ్గజ కార్పొరేషన్లతో రుసుములు చెల్లించేలా చేయాల్సింది పోయి, ప్రభుత్వం వ్యాపారులపై, వినియోగదారులపై భారం మోపాలని ఎంచుకుందని తెలిపారు. సాధారణ, పరస్పర అనుసంధాన, తక్కువ ఖర్చుతో కూడిన చెల్లింపులను అందించడానికి యూపీఐని పబ్లిక్ డిజిటల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌గా నిర్మించారని,విదేశీ కార్పొరేట్ ప్రయోజనాల కోసం దీనిని బలహీనపరచకూడదని సూచించారు. మోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేకమైన ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని యూపీఐని ఉచితంగా కొనసాగించాలని, యూపీఐ లావాదేవీలపై విధించాలనుకుంటున్న అన్ని రకాల ఛార్జీల ప్రతిపాదనలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. డిజిటల్ లావాదేవీలను పూర్తిగా ఉచితంగా కొనసాగించాలని, సామాన్యులకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా చూడాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం తన మూర్ఖపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే, ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, సిరబోయిన కరుణాకర్, జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా నాయకులు ఎన్. అశోక్ స్టాలిన్, మునిగాల బిక్షపతి, ఏదునూరి వెంకట్రాజం, నేదునూరి రాజమౌళి, బత్తిని సదానందం, కండె నర్సయ్య, గుంటి రాజేందర్, యాళ్ళ సంజయ్, అలకుంట యాకయ్య, నోముల కిషోర్, దొమ్మటి ప్రవీణ్, మదాసి యాకుబ్, పూజారి అమృతయ్య, కోడపాక బాబు, కంచర్ల కుమారస్వామి, శిరీష, రజిత తదితరులు పాల్గొన్నారు.

# విజయ్ సేతుపతి 'బత్తా' టీజర్ విడుదల..

### - వింటేజ్ లుక్‌లో అదరగొట్టిన మక్కల్




కోలీవుడ్ స్టార్ హీరో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తాజా చిత్రం 'బత్తా'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నడువుల కొంచెం పక్కతా కానుమ్న?', 'సీతకాతి' వంటి విభిన్న చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు బాలాజీ తరుణీధరన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి.పూర్తిగా 1960ల నాటి వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్ మరియు ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రంలో విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' ఫేమ్ లిజో మోల్ జోస్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక ఈ సినిమాకు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా, ఇటీవల విడుదలైన 'మగలే' అనే తండ్రీకూతుళ్ల భావోద్వేగ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తుండటం విశేషం. విజయ్ సేతుపతి వింటేజ్ లుక్‌లో బీడీ కాలుస్తూ చాలా డిఫరెంట్ స్టైల్‌లో కనిపిస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. ఈ సినిమా విడుదల తేదీని త్వరలోనే మేకర్స్ ప్రకటించనున్నారు.

# మైథలాజికల్ మూవీలో తమన్నా..
# ఆసక్తికరంగా 'ది వాన్' ట్రైలర్




స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా హీరో సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది వాన్'. మిస్టరీ, హారర్ నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి దీపక్ కుమార్ మిశ్రా దర్శకత్వం వహిస్తుండగా, ప్రముఖ నిర్మాణ సంస్థలు బాలాజీ మోషన్ పిక్చర్స్ మరియు టీవీఎఫ్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. శోభా కపూర్, ఏక్తా ఆర్ కపూర్, అరుణాభ్ కుమార్, మరియు నీరజ్ కొఠారి ఈ చిత్రానికి నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.ట్రైలర్ గమనిస్తే.. ఇది కేవలం సాధారణ హారర్ సినిమా కాకుండా, పురాతన నమ్మకాలు మరియు దైవిక శక్తుల ఆధారంగా సాగే ఒక విభిన్నమైన ఫాంటసీ థ్రిల్లర్‌గా కనిపిస్తోంది. ఒక ఆధునిక భావాలున్న పట్టణ యువకుడు (సిద్ధార్థ్ మల్హోత్రా) తన పూర్వీకుల గ్రామంలోని ప్రవేశ నిషేధమున్న ఒక రహస్య అడవిలోకి ప్రవేశించి, అక్కడ ఒక దివ్యమైన శక్తిని లేదా అదృశ్య రూపాన్ని మేల్కొలపడం వంటి అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. దీనివల్ల వారు ఎదుర్కొనే ఊహించని భయానక పరిణామాలు, ప్రమాదకర పరిస్థితులు ఏంటి అనేది ఈ సినిమా కథ. సినిమాలో తమన్నా పాత్ర అత్యంత కీలకమైందిగా తెలుస్తోంది. ఈ చిత్రంలో సునీల్ గ్రోవర్, మనీష్ పాల్, శ్వేతా తివారీ, అనుప్ సోని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. భారీ విజువల్స్, ఉత్కంఠభరితమైన మలుపులతో వస్తున్న ఈ చిత్రం సెప్టెంబర్ 25 న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది


# వరుస విజయాలతో బాక్సాఫీస్ క్వీన్‌గా మమిత బైజు..

### ఏడాదిలోపే రూ.1000 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం!

మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి వచ్చి అతి తక్కువ కాలంలోనే టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా సౌత్ ఇండియా అంతటా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీమణులలో మమిత బైజు ఒకరు. గడిచిన ఏడాది కాలంలో ఆమె నటించిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద వరుస విజయాలను నమోదు చేయడమే కాకుండా, ఏకంగా రూ. 1000 కోట్ల కలెక్షన్ల మార్క్‌ను దాటడం విశేషం. కేవలం సహజమైన నటనతోనే కాకుండా తనదైన ప్రత్యేక శైలితో యూత్‌ను విపరీతంగా ఆకట్టుకుంటున్న ఈ యంగ్ హీరోయిన్, ప్రస్తుతం సౌత్ సినిమా పరిశ్రమలో మోస్ట్ వాంటెడ్ నటిగా దూసుకుపోతున్నారు.కేరళలోని కొట్టాయంకు చెందిన మమిత బైజు 2016లో విడుదలైన 'పావడ' చిత్రంతో చైల్డ్ ఆర్టిస్ట్‌గా ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు చిత్రాల్లో కీలక పాత్రలు పోషించినప్పటికీ, 'ప్రేమలు' సినిమా ఆమె కెరీర్‌ను పూర్తిగా మలుపు తిప్పింది. ఆ చిత్రంలోని 'రీను' పాత్రతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో కూడా ఆమె బలమైన స్థానం సంపాదించుకున్నారు. ఆ తర్వాత ఆమె నటించిన ప్రతి సినిమా బాక్సాఫీస్ వద్ద అఖండ విజయాన్ని సొంతం చేసుకోవడం గమనార్హం. ఇక గత ఏడాది కాలంలో మమిత బైజు నటించిన సినిమాల బాక్సాఫీస్ సునామీ చూస్తే ఎవరికైనా ఆశ్చర్యం కలగక మానదు. విజయ్ సరసన నటించిన సినిమా ఏకంగా రూ. 300 కోట్లకు పైగా వసూలు చేయగా, ప్రదీప్ రంగనాథన్‌తో చేసిన చిత్రం రూ. 100 కోట్లు రాబట్టింది. అలాగే సూర్య నటిస్తున్న 'విశ్వనాథ్ అండ్ సన్స్' చిత్రం రూ. 260 కోట్లు, ధనుష్‌తో కలిసి నటించిన 'కర' సినిమా రూ. 55 కోట్లు సాధించాయి. మరోవైపు థియేటర్లలో దూసుకుపోతున్న 'బెత్లహోమ్ కుటుంబ యూనిట్' ఇప్పటికే రూ. 310 కోట్లకు పైగా వసూళ్లతో బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. ఇలా కేవలం 12 నెలల వ్యవధిలోనే ఆమె నటించిన చిత్రాలు సుమారు రూ. 1000 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచాయి. ఏ పాత్రలోనైనా పరకాయ ప్రవేశం చేసి, ఎంతో ఆత్మవిశ్వాసంతో నటించడంలో మమిత బైజు దిట్ట. ఏ పాత్రను ఎంచుకున్నా దానికి పూర్తి న్యాయం చేయడం ఆమె ప్రత్యేకత. అందుకే రోజురోజుకూ ఆమెకు ఫ్యాన్ ఫాలోవర్స్ భారీగా పెరిగిపోతున్నారు. వరుస విజయాలతో దూసుకుపోతున్న మమిత బైజు రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతమైన ప్రాజెక్టులతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు.



# వారణాసి' కథలో అదే కీలకం!



మహేష్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతున్న 'వారణాసి' సినిమాపై దేశవ్యాప్తంగా ఇప్పటికే భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకురానుంది. టైమ్ ట్రావెల్, మైథాలజీ అంశాలను కలబోసి అడ్వెంచర్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇందులో మహేశ్‌బాబు శివ భక్తుడు రుద్ర పాత్రలో కనిపించనున్నారు. రామాయణ కాలం నాటి ఘట్టాలు కథలో కీలకంగా ఉండబోతున్నాయి.తాజాగా ఈ సినిమా కథాంశం గురించి ఆసక్తికరమైన అప్‌డేట్ బయటికొచ్చింది. క్రీ.పూ 7000 సంవత్సరాల క్రితం మొదలయ్యే ఈ కథ వర్తమానం వరకు వివిధ కాలాల్లో పయనిస్తూ సాగుతుందని తెలిసింది. అయితే ఈ సినిమాలో టైమ్ ట్రావెల్‌కు ప్రత్యేకమైన మిషన్‌లాంటిది ఏదీ ఉండదని, కాలాన్ని దాటి వేల సంవత్సరాల చరిత్రలోకి కథానాయకుడు ఎలా వెళ్లాడనే అంశమే అత్యంత ప్రధానంగా ఉంటుందని చెబుతున్నారు. పురాణాలు, చరిత్ర, భవిష్యత్తును అనుసంధానించిన ఈ కథలో ప్రేక్షకుల్ని అబ్బురపరిచే అంశాలెన్నో ఉంటాయని సమాచారం. ప్రియాంకచోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు చిత్ర ప్రధాన తారాగణం.

# తెలుగులో మరో బంపరాఫర్



అగ్ర కథానాయిక శ్రీలీలకు వరుసగా అవకాశాలైతే వస్తున్నాయి కానీ..విజయాలు మాత్రం వరించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. అగ్ర హీరో బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కథానాయకుడిగా అరంగేట్రం చేయబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ఈ సినిమా తాలూకు అధికారిక ప్రకటన వెలువడింది.వశిష్ట దర్శకత్వం వహిస్తారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన ప్రీప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. త్వరలో లాంచ్ కానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రంలో శ్రీలీలను కథానాయికగా ఖరారు చేశారని తెలిసింది. దక్షిణాదితో పాటు బాలీవుడ్ నుంచి పలువురు యువ నాయికల పేర్లను పరిశీలించిన చిత్రబృందం చివరకు శ్రీలీలను ఓకే చేశారని అంటున్నారు. ఈ విషయంలో త్వరలో అధికారిక ప్రకటన రానుంది. ప్రస్తుతం శ్రీలీల తమిళంలో ధనుష్ 'ఓం' చిత్రంలో కథానాయికగా నటిస్తున్నది. అలాగే హిందీలో అనురాగ్ బసు దర్శకత్వంలో ఓ రొమాంటిక్ చిత్రంలో నటించనుంది.

# ప్యారడైజ్ బిర్యానీలా అద్భుతంగా ఉంటుంది



'నేను ఇంత పెద్ద సినిమా ఎప్పుడూ చేయలేదు. దర్శకనిర్మాతలు నా మీద పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని శాయశక్తుల కృషి చేశాను' అన్నారు సంపూర్ణేష్‌బాబు. నాని తాజా చిత్రం 'ది ప్యారడైజ్'లో బిర్యానీ అనే ఇంట్రెస్టింగ్ పాత్రలో కనిపించనున్నారు సంపూర్ణేష్‌బాబు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా ఈ నెల 24న విడుదలకానుంది. ఈ సందర్భంగా శనివారం సంపూర్ణేష్‌బాబు విలేకరులతో సినిమా విశేషాల్ని పంచుకున్నారు. ఈ సినిమాలో తాను నాని ఫ్రెండ్ క్యారెక్టర్‌లో కనిపిస్తానని, కథాగమనంలో తన పాత్రకు చాలా ప్రాముఖ్యత ఉంటుందని చెప్పారు.ఆయన మాట్లాడుతూ 'మూడు సంవత్సరాల క్రితం ఇలాంటి క్యారెక్టర్ వచ్చి ఉంటే నా కెరీర్‌లో కొన్ని మిస్టేక్స్ జరిగేవి కావు. నానిగారితో పనిచేయడం చాలా కంఫర్టబుల్‌గా అనిపించింది. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నా' అన్నారు. ఈ సినిమా కోసం తాను బరువు తగ్గానని, జుట్టు..గడ్డం కూడా పెంచానని సంపూర్ణేష్‌బాబు పేర్కొన్నారు. ప్యారడైజ్ బిర్యానీ ఎంత అద్భుతంగా ఉంటుందో ఈ సినిమా అంతే అద్భుతంగా ఉంటుందని, రెమ్యునరేషన్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉన్నానని సంపూర్ణేష్‌బాబు తెలిపారు.

Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450